సాక్షి
ఆదిలాబాద్

శనివారం : 10 : జూన్ : 2023

నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, వేదికపై సీఎస్, మంత్రులు, ఎమ్మెల్యేలు





బతుకమ్మతో మహిళ



బహిరంగ సభకు హాజరైన జనం

అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

మంచిర్యాల గడ్డ నుంచే..!

• సంక్షేమ పథకాలు, శంకుస్థాపనలు • సంబురంగా సాగిన సీఎం కేసీఆర్ పర్యటన • ఘనంగా కొత్త కలెక్టరేట్ ప్రారంభం

సాక్షి ప్రతినిధి,మంచిర్యాల: తెలంగాణకు ఈశాన్య ప్రాంతం మంచిర్యాలగడ్డ నుంచే సీఎం కేసీఆర్ సంక్షేమ దినోత్సవం రోజు దివ్యాంగులకు రూ.1,100 పింఛన్‌పెంపు,ఎంబీసీ కులవృత్తులకు రూ.లక్ష సాయం, సొంతిల్లు కట్టుకునే వారికి గృహలక్ష్మి కింద రూ.3లక్షల సాయం, రెండోవిడత గొర్రెల పంపిణీ ప్రారంభించి జిల్లా వాసులను మైమరిపించారు. సంక్షేమ సంబరాల్లోనే ప్రగతి నివేదన సభ నిర్వహించారు.

అట్టహాసంగా ప్రారంభోత్సవాలు

సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ జిల్లా నూతన కార్యాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, మంత్రులు, ప్రజాప్రతినిధులు వెంట రాగా సీఎం కేసీఆర్ రిబ్బన్ కట్ చేసి బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం సీఎం కేసీఆర్ రిబ్బన్ కట్ చేసి సీఎస్, మంత్రులు, ప్రజాప్రతినిధులు,అధికారులతో కలిసి కలెక్టరేట్‌లోకి అడుగుపెట్టారు. కలెక్టర్ సంతోష్‌ను కుర్చీలో కూర్చోబెట్టి, పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌ను కలెక్టర్ శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. సర్వమత ప్రార్థనల అనంతరం అధికారులను సీఎం శాలువాలతో సత్కరించారు.

మంచిర్యాలపై పాత జ్ఞాపకం

కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్‌కు పాత జ్ఞాపకం మనసులో తలుక్కున మెరిసింది. 'మంచిర్యాల జిల్లా కావాలన్న డిమాండ్.. ఎన్టీఆర్ ఏ కారణం చేతనో చేయలేక పోయారు. భగవంతుని కృప మనందరం చేసిన పోరాటం, తెలంగాణ ఉద్యమ ఫలితం మనకు తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది కాబట్టి ఈ రోజు ఇవన్నీ కూడా మనం నెరవేర్చుకోగల్గినం' అని గుర్తు చేసుకున్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు

చెన్నూరు ఎత్తిపోతల పథకం, మందమర్రిలో పామాయిల్ ఫ్యాక్టరీ, గడిపేట ప్రభుత్వ వైద్య కళాశాల భవనాల నిర్మాణానికి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అప్‌గ్రేడేషన్, మంచిర్యాల–అంతర్గాం గోదావరి నదిపై వంతెన నిర్మాణాల శంకుస్థాపనలకు సంబంధించిన శిలాఫలకాలను సీఎం ఆవిష్కరించారు.

చెక్కుల అందజేత

కలెక్టరేట్ వేదికగా సీఎం కేసీఆర్ బీసీల్లోని కులవృత్తి, చేతివృత్తిదారుల వారికి ఆర్థికసాయం పథకం, రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం, ఇళ్ల జాగాలేని నిరుపేదలైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమాలను సీఎం కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించారు. కోటపల్లి మండలం వెలమపల్లికి చెందిన కుందారపు మురళి, భీమారానికి చెందిన మామిడి సత్యనారాయణకు ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు లక్ష రూపాయల చెక్కును అందించారు. తాడూరు మండలం ఖాజీపేట గ్రామానికి చెందిన ఆవుల వెంకటేశ్, బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లి గ్రామానికి చెందిన గొలవేణి ఓదెలుకు గొర్రెల పంపిణీకి సంబంధించిన పత్రాలను సీఎం అందజేశారు. హాజీపూర్ మండలం దొనబండ గ్రామానికి చెందిన బిరుదుల లక్ష్మి, తోటపల్లి లావణ్యలకు ఇళ్ల స్థలాల పట్టాలను అందజేశారు.

చదువుల తల్లికి ప్రోత్సాహం

వేమనపల్లి మండలం చామనపల్లికి చెందిన శ్రీరాముల హరిత ఇంటర్మీడియెట్ ఎంపీసీ ఫస్టియర్‌లో 470కు 468 మార్కులతో స్టేట్ ఫస్ట్ వచ్చింది. ఈ అమ్మాయిని సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆమెను ఘనంగా సన్మానించి ఐఏఎస్ కావాలని దీవించారు. ఇంకా ఉన్నత చదువులు చదుకోవాలని ఆశీర్వదించారు. ఆమె ఉన్నత చదువులకు రూ.5 లక్షలు ఆర్థిక సహాయాన్ని సీఎం కేసీఆర్ ప్రకటించారు.

కేసీఆర్ దయతో జిల్లా



సీఎం కేసీఆర్ దయతో మంచిర్యాల జిల్లా ఏర్పడింది. అనేక అభివృద్ధి పనులు ఆయన నాయకత్వంలో జరుగుతున్నాయి. ఈ జిల్లాను గొప్పగా తీర్చిదిద్దుతున్నారు. కలెక్టరేట్, చెన్నూరు ఎత్తిపోతలు, గోదావరి నదిపై బ్రిడ్జి, మెడికల్ కాలేజీ భవనం శంకుస్థాపనలు, సింగరేణి, వ్యవసాయం, అన్నింటినీ వృద్ధి చేస్తున్నారు.

–ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్



వేదికపై కేసీఆర్, సుమన్, దివాకర్‌రావు, ఐకే రెడ్డి



చెక్కు అందజేస్తున్న కేసీఆర్, సీఎస్ శాంతికుమారి

సభ హైలెట్స్

- శుక్రవారం సాయంత్రం 5:17గంటలకు కేసీఆర్ హెలికాప్టర్ ద్వారా కలెక్టరేట్‌కు రాక.
- అక్కడి నుంచి నేరుగా కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యేక బస్సులో నస్పూర్‌లోని బీఆర్ఎస్ భవన్‌కు చేరిక.
- 5:26 గంటలకు బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం.
- 5:40 గంటలకు తిరిగి అదే బస్సులో కలెక్టరేట్‌కు చేరిక.
- 6గంటలకు కలెక్టరేట్ ప్రారంభం.
- 7:12గంటలకు బహిరంగ సభకు కేసీఆర్

సైడ్‌లైట్స్

- కేసీఆర్ హెలికాప్టర్‌లో వచ్చే సమయానికి సభలో చాలా కుర్చీలు ఖాళీగా ఉండడంతో పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఆందోళన చెందారు.
- కేసీఆర్ సభకు వచ్చే ముందు వేలాది మందితో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దీంతో గులాబీశ్రేణులు ఊపిరి పీల్చుకున్నారు.
- సీఎం భద్రత దృష్ట్యా సభ ప్రాంగణానికి ఉత్తరం వైపు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో అటు వైపు నుంచే భారీగా వచ్చిన జనాలు లోపలికి రావడానికి ఇబ్బంది పడ్డారు. దీంతో ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దివాకర్‌రావు కాస్త ఆగ్రహం వ్యక్తం చేయడంతో పోలీసులు బారికేడ్లను తొలగించారు.
- సభలో మేదరికుల సంఘ సభ్యులు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలియజేస్తూ చాటలపై రాసి చూపించారు.
- సీఎం సభ ప్రారంభానికి ముందు రాష్ట్ర సమాచార శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాతో దృశ్యాలను చిత్రీకరించే ప్రయత్నం చేయగా సీఎం సెక్యూరిటీ, పోలీసులు అడ్డుకున్నారు.
- సీఎం మాట్లాడుతుండగా కొందరు విజిల్స్ వేస్తూ అల్లరి చేస్తూ ఉండగా సీఎం కల్పించుకుని సీటీలు వేసేటోళ్లు మనోళ్లు కారు.. వాళ్లను నివారించండి అంటూ సీఎం అనడంతో సభలో నవ్వులు వెల్లివిరిశాయి. సీటీలు, చప్పట్లు కొట్టాలంటే అంతా అయ్యాక కొట్టండి అంటూ సీఎం హితవు పలికారు.
- సాంస్కృతిక సమాఖ్య కళాకారులతో కలిసి గిడ్డంగుల శాఖ చైర్మన్ సాయిచంద్ సీఎం కేసీఆర్‌పై ప్రసంశల జల్లులతో పాటలు పాడుతూ సభలో జోరు పెంచారు.
- సభావేదికపై ఉన్న కేసీఆర్‌కు శిశు, సంక్షేమ శాఖా మాజీ ఆర్గనైజర్ అత్తి సరోజ నుదుటన కుంకుమ పెట్టి రక్షణ కంకణాన్ని కట్టారు.
- ధరణి ఉండాలా? వద్దా? ఉండాలే అనే వారు చేతులెత్తండి అని కేసీఆర్ అనడంతో సభకు హాజరైన జనాలంతా చేతులెత్తి సంఘీభావం తెలిపారు.
- నాకన్నా ముందు దొడ్డు సీఎంలు, పాడవు సీఎంలు పని చేశారు. వారెవ్వరు రైతులను పట్టించుకోలేదని కేసీఆర్ అనగానే సభలో నవ్వులు పూశాయి.

– మంచిర్యాలరూరల్(హాజీపూర్)/ శ్రీరాంపూర్/నస్పూర్



చాటలతో అభిమానం చాటుకున్న మేదరులు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

• కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులందరికీ అందేలా యంత్రాంగం ప్రత్యేక కృషి చేస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా మావల మండలంలోని ఓ గార్డెన్‌లో శుక్రవారం సంక్షేమ సంబరాలు కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులకు రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీసీ, ఎస్సీ, మైనార్టీ, డీఆర్డీవో శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ, ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ, అర్హులందరూ సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మనోహర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం..

బోథ్: సంక్షేమ పథకాల అమలులో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలోని పరిచయ గార్డెన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ, జెడ్పీటీసీ సంధ్యారాణి, తహసీల్దార్ అతికొద్దీన్, ఎంపీడీవో లక్ష్మణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్‌సింగ్, ఆత్మ చైర్మన్ సుభాష్, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ రమణగౌడ్, వైస్‌ఎంపీపీ లింబాజీ, బీఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. అలాగే బోథ్ అటవీశాఖ పరిధిలో చిరుత దాడిలో మృతి చెందిన పశువులకు సంబంధించి యజమానులకు ఎమ్మెల్యే పరిహారం అందించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో ప్రణయ్, ఎఫ్ఎవోలు సుందర్, కోసెరావ్ ఉన్నారు.



మహిళకు చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే జోగు రామన్న

ఇక వేర్వేరుగా రోడ్లు, భవనాల నిర్వహణ

• నేడు కొత్త సబ్ డివిజన్ కార్యాలయాలు ప్రారంభం

కైలాస్‌నగర్: ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించి ఇన్నాళ్లు సంయుక్తంగా కొనసాగిన రోడ్లు, భవనాల నిర్వహణ ఇక వేరువేరుగా ఉంటుంది. పనులు త్వరితగతిన చేపట్టడంతో పాటు పర్యవేక్షణ మరింత పటిష్టం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆర్అండ్‌బీ శాఖను పునర్‌వ్యవస్థీకరించింది. ఇందులో భాగంగా వీటి నిర్వహణకు వేరువేరుగా సబ్‌డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేసింది. అధికారులు, సిబ్బందిని సైతం నియమించేందుకు కసరత్తు చేస్తోంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి కొత్తగా బిల్డింగ్ సబ్ డివిజన్, జాతీయ రహదారుల సబ్ డివిజన్‌ను మంజూరు చేసింది. అలాగే ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో జరిగే పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పనుల నాణ్యత పర్యవేక్షించే క్వాలిటీ కంట్రోల్ ప్రత్యేక విభాగానికి సంబంధించిన సబ్ డివిజన్‌ను సైతం కొత్తగా ఆదిలాబాద్ కేంద్రంగా మంజూరు చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో ఈ కార్యాలయాల నిర్వాహణకు సంబంధించి ఆర్అండ్‌బీ అధికారులు తగు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం కొనసాగుతున్న డీఈ కార్యాలయం పక్కనే ఉన్న గదుల్లో ఈ మూడు కార్యాలయాల ఏర్పాటుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కార్యాలయాల వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటుతో పాటు అధికారులు, సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు సైతం కల్పించారు. ప్రస్తుతం ఉన్న అధికారులే ఈ కార్యాలయాలకు ఇన్‌చార్జీలుగా కొనసాగనున్నారు. తొలుత ఈ కార్యాలయాలను ఈ నెల 2వ తేదీనే ప్రారంభించాల్సి ఉన్నా అనివార్యకారణాలతో వాయిదా పడింది. తాజాగా శనివారం ఈ కార్యాలయాలను స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఈమేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని ఆర్అండ్‌బీ ఈఈ నర్సయ్య తెలిపారు. శనివారం నుంచి ఆయా కార్యాలయాల పరిధిలో నే భవన నిర్మాణాల పనులకు సంబంధించిన సేవలు అందుబాటులోకి రానున్నట్లుగా ఆయన వెల్లడించారు.



ప్రారంభానికి సిద్ధమైన ఆర్అండ్‌బీ సబ్‌డివిజన్ కార్యాలయాలు

న్యూస్‌రీల్

గ్రామాలతో ఆర్టీసీది విడదీయరాని అనుబంధం



విలేజ్ బస్ ఆఫీసర్లతో అదనపు కలెక్టర్ నటరాజ్, డీఎం కల్పన

ఆదిలాబాద్: గ్రామాలతో ఆర్టీసీది విడదీయరాని అనుబంధమని అదనపు కలెక్టర్ నటరాజ్ అన్నారు. స్థానిక డిపో గ్యారేజీలో విలేజ్ బస్ ఆఫీసర్ సేవల ప్రారంభ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై విలేజ్ బస్ ఆఫీసర్లుగా నియమితులైన కండక్టర్లు, డ్రైవర్లకు కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆర్టీసీ సేవలు గ్రామస్థాయిలో మరింతగా విస్తరించేందుకు విలేజ్ బస్ ఆఫీసర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టడం హర్షనీయమన్నారు. సంస్థ పురోగతి సాధించేలా, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఆర్టీసీ డీఎం కల్పన, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయసేవ సదన్ భవన్‌లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. డబ్బుతో పాటు సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు.

12న తెలంగాణ రన్

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా పోలీసు, యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12న తెలంగాణ రన్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ఉదయం 6 గంటలకు ఈ రన్ ప్రారంభం కానుందని పే ర్కొన్నారు. జిల్లాలోని విద్యార్థులు, యువకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ శిక్షణ అభ్యర్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువజన, క్రీడాసంఘాల సభ్యులు, మెడికోలు, ప్రజలు, వాకర్స్, సీనియర్ సిటిజన్, పోలీసు, ఎక్సైజ్, ఫైర్, ఇతరశాఖల ఉద్యోగులు, మాజీ సైనికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయలని కోరారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి సుజాత్ ఖాన్ అన్నారు. పట్టణంలోని నంబర్–1 పాఠశాలలో ఉపాధ్యాయులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్, డిజిటల్ క్లాస్‌రూమ్‌పై శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు డిజిటల్ పాఠాలు అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ చంద్రశేఖర్, విద్యాసాగర్ రెడ్డి, అజయ్, ప్రీత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిర్సాముండా వర్ధంతి



బిర్సా ముండా విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: క్రాంతివీర్ బిర్సాముండా వర్ధంతిని హీరా సుక్క జాగృతి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఎదుట గల ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే జోగు రామన్న తదితరులు పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఆ మహనీయుని ఆశయ సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దుర్గం ట్రస్టు చైర్మన్ శేఖర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, ఆనంద్‌రావ్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సిడాం రాంకిషన్, ఉపాధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల నిరసన

కైలాస్‌నగర్: సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా శుక్రవారంతో తొమ్మిదవ రోజుకు చేరింది. అయినా అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తూ దివ్యాంగులు కళ్లకు నల్లగంతలు కట్టుకొని నిరసన తెలిపారు. వేదిక జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇమ్రాన్, నాయకులు షఫీ, అరుణ్, వెంకటేశ్, నయీమ్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

ఖానాపూర్: ఖానాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఇటీవల పట్టుబడిన 12మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. ఈ విషయమై 12 మందిని శుక్రవారం ఖానాపూర్ కోర్టులో హాజరుపరచగా 10మందికి రూ.9500 జరిమానాతో పాటు ఇద్దరికీ ఒకరోజు జైలు శిక్షను కోర్టు మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ విధించినట్లు ఎస్సై తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ఎంతో ప్రమాదకరమని అన్నారు. ఇప్పటికైనా మందుబాబులు మద్యం సేవించి నడపడం నిలిపివేయాలని హెచ్చరించారు. లేకపోతే చర్యలు తప్పవన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


షేక్‌బాబు మృతదేహం

సారంగపూర్: మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన షేక్‌బాబు(60) శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు చెరువులో జారి పడి మృతిచెందాడు. పోలీసులు, బంధువుల వివరాల ప్రకారం... షేక్‌బాబు చెరువు సమీపంలో ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. కొద్దిసేపు పని చేసిన అనంతరం కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువులోకి వెళ్లాడు. చెరువులో నల్లమట్టి తరలించిన గుంతలో నీరు అధికంగా ఉండటంతో ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడి మృతిచెందాడు. అతడి భార్య శేక్ హలీమా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

కుభీర్: మండలంలోని ఫకిర్‌నాయక్ తండాకు చెందిన రాథోడ్ మంగిలాల్(43) మద్యానికి బానిసై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎండీ.షరీఫ్ వివరాల ప్రకారం.. మంగిలాల్ రోజు మద్యం మత్తులో కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. శుక్రవారం ఉదయం సైతం మద్యం మత్తులో కుటుంబీకులతో గొడవ పడ్డాడు. అనంతరం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు రాథోడ్ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తుతెలియని మృతదేహం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖానాపూర్ క్రిస్టల్ గార్డెన్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైనట్లు వన్‌టౌన్ ఎస్సై నారాయణ తెలిపారు. ఖానాపూర్‌లో ఓ ఇంటి నిర్మాణం చేపడుతుండగా అక్కడ ఆ వ్యక్తి మృతిచెంది కనిపించాడు. మృతుడి వయస్సు 40సంవత్సరాలు ఉంటుందని, కుడిచేతిపై అంజు అని రాసి ఉందని పేర్కొన్నారు. సంబంధికులు ఎవరైనా ఉంటే వన్‌టౌన్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రాణం తీసిన చేపల వేట

తలమడుగు: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన కోండ్ర పోచన్న(50) శుక్రవారం ఉదయం చేపలు పట్టేందుకు గ్రామ సమీపంలోని చెరువుకు వెళ్లాడు. చెరువులో కాళ్లకు వల చుట్టుకుని చెరువులో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అప్పారావు తెలిపారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో మోసాలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు కౌడల మహేందర్, తాంసి మండలం కప్పర్ల గ్రామ వాసి. గతేడాది సిక్సర్ అనే పత్తి రకాన్ని మూడెకరాల్లో సాగు చేశాడు. పత్తి ఏపుగా పెరిగిన కాత, పూత రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. ప్రతీ ఏటా జిల్లాలో ఇలా అనేక మంది రైతులు నకిలీ విత్తనాలతో మోసపోతూనే ఉన్నారు.

- విత్తన విక్రయాల్లో గోల్‌మాల్
- చేతివాటం ప్రదర్శిస్తున్న ఫర్టిలైజర్ యజమానులు
- మామూలుగా తీసుకుంటున్న అధికారులు
- నిండామునుగుతున్న రైతులు


ఇచ్చోడలోని ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న తూనికలు, కొలతల జిల్లా అధికారి జలీల్

ఇచ్చోడ: విత్తనాల విక్రయాల్లో ఫర్టిలైజర్ యజమానులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. వ్యవసాయ సీజన్ మొదలు కావడంతో ఫర్టిలైజర్ దుకాణాల్లో విత్తనాల కొనుగోళ్ల కోసం రైతులు క్యూలు కడుతున్నారు. ఇదే అదునుగా భావించిన ఫర్టిలైజర్ యజమానులు తమ చేతివాటం ప్రదర్శిస్తూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ప్రభుత్వ అనుమతులు లేని, కంపెనీల పేర్లు లేని ప్యాకెట్లపై యూనిట్ సేల్, ధర, బరువు తయారు చేసే కంపెనీల పేర్లు లేనివి రైతులకు అంటగడుతున్నారు.

తనిఖీలతో వెలుగులోకి....

జిల్లాలో 525 ఫర్టిలైజర్ దుకాణాలు ఉన్నాయి. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలో తూనికల కొలతల అధికారి ఆకస్మాత్తుగా నిర్వహించిన తనిఖీలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొన్ని రకాల విత్తన ప్యాకెట్లపై యూనిట్ సేల్, తయారు చేసే కంపెనీల పేర్లు, తూనికల కొలతల శాఖ నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలు విక్రయించడంతో ఆ శాఖ జిల్లా అధికారి ఐదు ఫర్టిలైజర్ దుకాణాలపై కేసులు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా 525 ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తే వందల కొద్ది యజమానులపై కేసులు నమోదు కావడానికి అవకాశం లేకపోలేదని తెలుస్తోంది.

విత్తన విక్రయాల్లో గోల్‌మాల్..

జిల్లాలో గత కొన్నేళ్ల నుంచి విత్తన విక్రయాల్లో గోల్‌మాల్ చోటుచేసుకుంటుంది. ప్రభుత్వం నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదు. ఏటా కొత్త కొత్త కంపెనీల పేర్లతో మార్కెట్లోకి వచ్చే పత్తి విత్తనాల రకాలను అధిక దిగుబడుల పేరుతో ప్రభుత్వ అనుమతులు లేని విత్తనాలను దాదాపుగా ప్రతీ ఏటా 2 నుంచి 3లక్షల ప్యాకెట్లను ఫర్టిలైజర్ యజమానులు రైతులకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

కంపెనీలు ఇచ్చే ఆఫర్లే..

కంపెనీలు విత్తనాల డీలర్లకు ఇస్తున్న భారీ ఆఫర్లతోనే ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నట్లు సమాచారం. ఇలాంటి కంపెనీలు, డీలర్లకు లక్షల, కోట్ల రూపాయలు టార్గెట్ ఇచ్చి వాటిని రైతులకు విక్రయించే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తుంటారు. టార్గెట్ పూర్తి చేసిన డీలర్లుకు దుబాయి, బ్యాంకాగ్ లాంటి విదేశాలకు తీసుకెళ్తుంటారు. వారం రోజుల పాటు విదేశాల్లో ఇక్కడి నుంచి వెళ్లిన డీలర్ల కోసం లక్షల రూపాయల్లో ఖర్చుపెట్టి ఖరీదైన బహుమతులు అందజేస్తారు. దీంతో జిల్లాలో విత్తన డీలర్లు వారి జల్సాల కోసం నకిలీ, అనుమతులు లేని విత్తనాలను రైతులకు అంటకడుతున్నారు.

ఆదిలాబాద్ జిల్లాలో సాగు వివరాలు...
జిల్లాలో ఈ ఏడాది సాగవుతున్న పత్తి : 3,57,892 (ఎకరాల్లో)
సాగు లెక్క ప్రకారం కావాల్సిన పత్తి ప్యాకెట్లు : 7,15,784
గతేడాది జిల్లాలో తూనికల కొలతల శాఖ నమోదు చేసిన కేసులు : 04
ఈ ఏడాదిలో జూన్ 7 వరకు నమోదైన కేసులు: 05
జిల్లాలో ఫర్టిలైజర్ దుకాణాల సంఖ్య : 525

మామూలుగా తీసుకుంటున్న అధికారులు..

ఏటా వ్యవసాయ సీజన్ ప్రారంభంలో రాష్ట్ర, జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందాలు, తూనికల కొలతల అధికారులు ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తుంటారు. నకిలీ, ప్రభుత్వ అనుమతులు లేని వాటిని రైతులకు చేరకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నానా హంగామా చేస్తుంటారు. కానీ ఆ తర్వాత మామూలుగా తీసుకోవడంతో జిల్లాలో ఈ దందా ప్రతీ ఏటా యథావిధిగా కొనసాగుతూనే ఉంది.

తనిఖీలు నిర్వహిస్తున్నాం

జిల్లా వ్యాప్తంగా ఫర్టిలైజర్ దుకాణాల్లో తూనికల కొలతల శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. ఈ ఏడాది ఇచ్చోడలో ఐదుగురిపై కేసులు నమోదు చేశాం. విత్తనాల ప్యాకెట్లపై కంపెనీ పేరు, ధర, తయారు చేసిన తేదీలు లేకుంటే వాటిని రైతులు కొనుగోళ్లు చేయవద్దు.

– ఎంఏ జలీల్, తూనికలు, కొలతల జిల్లా అధికారి.

'కథనానికి' కదిలారు..

- సాక్షి కథనానికి స్పందిస్తున్న మానవతావాదులు
- బాధిత కుటుంబానికి ఇల్లు కట్టించడానికి ముందుకొచ్చిన యువకులు
- రూ.20వేల ఆర్థిక సహాయం చేసిన ఎంపీపీ తుల శ్రీనివాస్


రూ.20వేల ఆర్థిక సాయం అందిస్తున్న ఎంపీపీ తుల శ్రీనివాస్

బోథ్: మండలంలోని గుర్రాలతండా గ్రామానికి చెందిన మల్హారిసింగ్ కుటుంబ దీనగాథను సాక్షిలో ఈ నెల 3వ తేదీన 'ఇంటికి పెద్దదిక్కు... ఆ చిన్నారి' శీర్షికన ప్రచురితమైంది. మల్హారిసింగ్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, ఓ కూతురు మానసిక వికలంగురాలు, చిన్న కూతురుకు మాటలు రావు. ఆ కుటుంబ భారాన్ని ఆ చిన్నారిపై పడింది. దీంతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి మానవతావాదుల నుంచి స్పందన లభిస్తోంది. కథనాన్ని చూసిన వా రు తమకు తోచిన సహాయాన్ని అందిస్తున్నారు. తా జాగా కథనాన్ని చూసిన ఎంపీపీ తుల శ్రీనివాస్ చ లించిపోయాడు. శుక్రవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణానికి రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇప్పటికే ఇంటి నిర్మాణానికి కొంతమంది యువకులు నగదును కూడబెడుతుండగా వారికి ఈ నగదు ను అందించారు. అలాగే నిత్యావసర సరుకులు సైతం అందజేశారు. ఇంటి నిర్మాణానికి రూ.70వేలు జమైనట్లు యువకులు తెలిపారు. ఆయన వెంట తుల శ్రీనివాస్ సొసైటీ సభ్యులు ఉన్నారు. కాగా మదర్ డ్రీమ్స్ సంస్థ ప్రతినిధులు గతంలో రూ.5వేల అందించగా శుక్రవారం మల్హారిసింగ్‌కు, ఇద్దరు కూతుళ్లకు రెండు జతల బట్టలు అందజేశా రు. దాతలు ఆదుకోవాలని స్థానికులంటున్నారు.

స్పందించాల్సిన దాతలు
చౌహాన్ వినోద్ ఫోన్‌పే : 7670921393

భక్తులతో బాసర కిటకిట..


మకర తోరణం అందిస్తున్న భక్తుడు కె కృష్ణకుమార్

భైంసా: బాసర శ్రీజ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శుక్రవారం కావడం, మరో మూడు రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గోదావరిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులతో అక్షరాభ్యాస పూజలు చేయించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

అమ్మవారికి మకర తోరణం విరాళం

బాసర శ్రీజ్ఞానసరస్వతి అమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు కె.కృష్ణకుమార్ మకర తోరణం అందజేశారు. రూ.1.15 లక్షల వెండితో దీనిని తయారు చేయించారు. ఈవో విజయరామారావు, ప్రధానార్చకులు సంజీవ్‌కు శుక్రవారం అందించారు.

ధాన్యం లారీలో మంటలు



దగ్ధమవుతున్న ధాన్యం బస్తాల లారీ, నిలిచిపోయిన వాహనాలు

- బుగ్గి పాలైన 150 ధాన్యం బస్తాలు
- ఇంజన్ క్యాబిన్‌లో చెలరేగిన మంటలు

దిలావర్‌పూర్ : మండలంలోని సిర్గాపూర్ గ్రామ బస్టాండ్ సమీపంలో నిర్మల్–భైంసా రహదారిపై శుక్రవారం ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. సారంగాపూర్ మండలం కౌట్ల గ్రామంలోని కొనుగోలు కేంద్రం నుంచి 640 బస్తాల లోడ్‌తో ముధోల్ ప్రాంతంలోని రైస్ మిల్‌కు లారీ బయలుదేరింది. సిర్గాపూర్ బస్టాండ్ ప్రాంతంలో లారీ క్యాబిన్‌లో మంటలు చెలరేగడంతో డ్రైవర్ అప్రమత్తమై వెంటనే లారీని నిలిపి కిందకు దూకాడు. అప్పటికే పొగలు కమ్ముతూ క్యాబిన్‌లో మంటలు చెలరేగి పోవడంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందజేశారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే అక్కడకు చేరుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు మంటలను ఆర్పేందుకు శ్రమించారు. దీంతో లారీలోని దాదాపుగా 150 బస్తాల ధాన్యం కాలి బూడిదైంది. కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై గంగాధర్ తెలిపారు.

అటవీశాఖ అధికారులపై చర్య తీసుకోవాలి


బాధితుడిని పరామర్శిస్తున్న బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: సిడాం పగ్గు అనే వ్యక్తిని చితకబాదిన అటవీశాఖ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు డిమాండ్ చేశారు. మండలంలోని మొరిపేట గ్రామంలో రెండు రోజుల క్రితం పగ్గు కట్టెల కోసం అడవికి వెళ్లాడు. అతడిని పట్టుకుని అటవీశాఖ అధికారులు బీర్సాయిపేట్ అటవీ కార్యాలయానికి తీసుకువెళ్లి చితకబాదారు. రూ.35వేల జరిమానా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం మొర్రిగూడ గ్రామస్తులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్‌కు సమాచారం అందించడంతో ఈ విషయం వెలుగుచూసింది. దీంతో బొజ్జు పటేల్ శుక్రవారం మొర్రిపేట్ గ్రామానికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. అనంతరం సిడాం పగ్గును ఉట్నూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మాట్లాడారు. సదరు అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే శనివారం ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సర్పంచ్ భగవంత్‌రావు, ఉప సర్పంచ్ గంగాధర్, భీమన్, బిరుదుల లాజర్, దేవానంద్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన


అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శిస్తున్న డిప్యూటీ సెక్రెటరీ

ఆదిలాబాద్‌రూరల్: మినిస్ట్రీ ఆఫ్ ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ డిప్యూటీ సెక్రెటరీ శుక్లాల్ మీనా శుక్రవారం మండలంలోని అంకోలి, సిరికొండ, పిప్పల్‌ధరి, మామడిగూడ, చిన్న సల్పాల్‌గూడ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. కేంద్రాలకు వచ్చే పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారం, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అర్బన్ సీడీపీవో వనజా, సూపర్‌వైజర్లు నీరజా, రూప ఉన్నారు.

వన్యప్రాణులకు హానిచేస్తే కఠిన చర్యలు

- నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి
- పెంపుడు కుక్కను హతమార్చిన నిందితుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

లక్ష్మణచాంద: వన్యప్రాణులకు హాని కలిగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. పెంపుడు కుక్కను హతమార్చి దాని మాంసాన్ని జింక మాంసం పేరుతో విక్రయించిన ఇద్దరు నిందితుల వివరాలను శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ వివరించారు. గత నెల మే 30వ తేదీన మండల కేంద్రానికి చెందిన ఏంజలి ఆనంద్ అనే వ్యక్తికి చెందిన పెంపుడు కుక్క కనిపించడం లేదని, ఎవరో దొంగిలించారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్సై రాహుల్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మండలంలోని పొట్టపెల్లి గ్రామానికి చెందిన మాచెట్ల శ్రీనివాస్, చామన్‌పెల్లి గ్రామానికి చెందిన లోకిని వరుణ్ జల్సాలకు అలవాటుపడి మండలంలోని కుక్కలను దొంగతనం చేస్తూ వాటిని చంపి వాటి మాంసాన్ని జింక మాంసం పేరుతో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఏంజలి ఆనంద్ కుక్కను ఇంటి నుంచి బైక్‌పై ఎత్తుకెళ్లి పొట్టపెల్లి గ్రామ శివారులోని ఓ వాగులో చంపి దాని మాంసాన్ని మండలంలోని పలు గ్రామాల్లో జింక మాంసం పేరుతో కేజీకి రూ.500 చొప్పున విక్రయించారు. వారిని శుక్రవారం అరెస్టు వన్యప్రాణులకు హాని కలిగించినందుకు సెక్షన్ 379 సెక్షన్ కింద, మోసపూరితంగా జింక మాంసం అని నమ్మించినందుకు 429 సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి ఎక్సెల్ మోటార్ సైకిల్, రూ.3000 నగదు, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వన్యప్రాణులను ఎవరైనా హతమార్చితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వన్యప్రాణుల మాంసం విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కేసును చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న ఎస్సై రాహుల్ గైక్వాడ్, సిబ్బంది అశోక్, అనిల్, గణేష్, వనితలను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఐఎల్‌వో పరిశోధకుడు ఆజింక్య


వివరాలు తెలుసుకుంటున్న ఐఎల్‌వో పరిశోధకుడు ఆంజిక్య

ఎదులాపురం: జిల్లాలోని వ్యవసాయ రంగ, పారిశ్రామిక రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) పరిశోధకుడు ఆజింక్య అన్నారు. జిల్లాలో ఏఐటీయూసీ నాయకులతో కలిసి శుక్రవారం పర్యటించిన ఆయన జిల్లాలోని వ్యవసాయశాఖ, కార్మికశాఖ అధికారులను కలిసి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో పత్తి పంట ఉత్పత్తిలో భాగస్వాములయ్యే కార్మికులు, రైతులు, వారి వివరాలు, బాల కార్మికుల నిర్మూలనపై వివరాలను సేకరించారు. అదేవిధంగా పని ప్రదేశాల్లో కార్మికులకు కల్పిస్తున్న కనీస సౌకర్యాలు, వెట్టిచాకిరీ, పత్తి పంటకు అందిస్తున్న గిట్టుబాటు ధర, జిల్లాల్లో ఎన్ని ఎకరాల్లో పత్తి పంట సాగవుతోంది. చిన్న, సన్నకారు రైతులు సంఖ్య ఎంత వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయరంగ, కార్మిక రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం జరిగిందని, వీటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇందులో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి, ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ విలాస్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, ఐఎల్‌వో ఇచ్చోడ మండల కోఆర్డినేటర్ కల్లెపల్లి గంగయ్య, జైనథ్ మండల కోఆర్డినేటర్ ఆశన్న పాల్గొన్నారు.


కేసీఆర్‌కు వేంకటేశ్వరుడి చిత్రపటం ఇస్తున్న కలెక్టర్ సంతోష్


కేసీఆర్ నుదుట తిలకం దిద్దుతున్న నాయకురాలు

ప్రగతి నివేదన సభ సక్సెస్

సీఎం కేసీఆర్ శుక్రవారం మంచిర్యాలలో పర్యటించారు. సమీకృత కలెక్టరేట్, బీఆర్ఎస్ కార్యాలయ భవనాలు ప్రారంభించారు. బీసీ కుల వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థికసాయం, గృహలక్ష్మి పథకాలను లాంచ్ చేశారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నస్పూర్‌లో ఏర్పాటు చేసిన మంచిర్యాల ప్రగతి నివేదన బహిరంగ సభలో ప్రసంగించారు. సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణుల్లో జోష్ కనిపించింది.


బతుకమ్మతో సభకు హాజరైన మహిళలు


వేదికపై బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు